క్లుప్తంగా

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

మడకశిరరూరల్: మండల పరిధిలోని సీ కొడిగేపల్లిలో గురువారం ఉదయం 8 గంటల నుంచి ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కవిత తెలిపారు.

లేపాక్షి: మండలంలోని కల్లూరు, బైరాపురం, నాయనిపల్లి గ్రామాల్లో గురువారం ఉదయం 9 గంటల నుంచి హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం సమన్వయకర్త టీఎస్ దీపిక ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ నరసింహనాయుడు తెలిపారు.

వైద్య చికిత్సకు ఆర్థిక సాయం



వైద్యం కోసం ఆర్థిక సహాయం అందిస్తున్న ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్

హిందూపురం: పట్టణంలోని రహమత్‌పురం సర్కిల్ మారెమ్మగుడి వీధి వద్ద ఉన్న నివాసమున్న గోవిందు పెరాలసిస్‌కు గురై వైద్య చికిత్సలకు ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఏపీ ఆగ్రో చైర్మన్ నవీన్‌నిశ్చల్ బాధిత కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. మరోవైపు పట్టణంలోని 27వవార్డులోని అంబేడ్కర్‌నగర్‌లో నివాసమున్న కార్తీక్ చదువుకు రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొందిలోని వెంకటేశ్వర వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బుధవారం పట్టణానికి చెందిన ఆర్య వైశ్య వాసవీ యువతి సంఘం సభ్యులు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మట్కా బీటర్ల అరెస్ట్



అదుపులోకి తీసుకున్న మట్కా బీటర్లను చూపుతున్న పోలీసులు

పెనుకొండ: పట్టణ శివార్లలో మట్కా చీటీలు రాస్తున్న పలువురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ. రమేష్‌బాబు తెలిపారు. నలుగురిని అదుపులోకి తీసుకోగా మరో ఐదుగురు పరారయ్యారని చెప్పారు. అదుపులోకి తీసుకున్న వారిలో అహ్మద్, వెంకటేష్, జహంగీర్, రియాజ్ ఉన్నారన్నారు. పరారైన వారిలో కుమ్మర శ్రీనివాస్, కుమ్మర గోపాల్, కుమ్మర రమేష్, కుమ్మర బాబయ్య, కుమ్మర శీనప్ప ఉన్నారన్నారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత



మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. బుధవారం మధుగిరి సర్కిల్‌లో రూ.10 లక్షల నిధులతో మరుగుదొడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే తిప్పేస్వామి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో మరుగుదొడ్లు లేక ప్రజలు, ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారి ఇబ్బందులను గుర్తించి మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశామన్నారు. మధుగిరి, అంబేద్కర్ సర్కిళ్లల్లో మరుగుదొడ్లను నిర్మిస్తున్నామని తెలిపారు. వైఎస్సార్ సర్కిల్‌లోని మరుగుదొడ్లను కూడా మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకోస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, సింగల్‌విండో అధ్యక్షులు రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజ స్తంభ పునఃప్రతిష్ట



కలశాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని యర్రగోడపల్లి తండా గ్రామంలో బుధవారం ఘనంగా యర్రగోడపల్లి ఆంజనేయస్వామి ధ్వజస్తంభం, కలశ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు భక్తి శ్రద్ధలతో జ్యోతుల ఉత్సవాలు నిర్వహించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వివాదాలకు కేరాఫ్‌గా చిలమత్తూరు పీహెచ్‌సీ

- పురిటి బిడ్డ మృతిని దాచిన వైద్యసిబ్బంది
- వైద్యురాలి గోలీలాట వీడియో వైరల్
- సంచలనంగా మారిన ఎంఎల్‌హెచ్‌పీ ఆత్మహత్యాయత్నం
- తూతూ మంత్రంగా చర్యలు చేపట్టిన అధికారులు



చిలమత్తూరు పీహెచ్‌సీ ముఖచిత్రం

చిలమత్తూరు: డ్యూటీలో ఉండగా వైద్యురాలి గోలీలాట, ఉద్యోగి ఆత్మహత్యాయత్నం, పురిటి బిడ్డ మృతిని దాచిన వైద్యసిబ్బంది, డీడీఓ పోస్టుపై పోట్లాట.. ఇలా ఒకదాని వెంట మరొకటి రచ్చతో చిలమత్తూరు పీహెచ్‌సీ తరచూ వార్తల్లోకెక్కుతోంది.

తూతూ మంత్రంగా విచారణ

మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యుల మధ్యరేగిన చిచ్చు బదిలీల వరకూ వెళ్లింది. గోలీలాట వ్యవహారం మొదలుకొని ప్రతి అంశంలోనూ వివాదాలు చుట్టుముట్టాయి. విచారణ జరిపి సద్దుమణిగేలా చేయాల్సిన ఉన్నతాధికారులు కూడా అరకొర విచారణలతో మమా అనిపించి మొత్తం వ్యవహారాన్ని జిల్లా కలెక్టర్ మీదకు తోసేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. క్షేత్రస్థాయిలో ఇచ్చే విచారణ నివేదికల ఆధారంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఉంటాయన్నది అందరికీ తెలిసిందే.

మార్చి 28న శిశువు మరణం

ఈ ఏడాది మార్చి 28న కొడికొండకు చెందిన సుజాత అనే గర్భిణికి నొప్పులు రావడంతో ప్రసవం కోసం చిలమత్తూరు పీహెచ్‌సీకు వచ్చింది. ఈ నేపథ్యంలో డ్యూటీలో ఉన్న డా.తేజశ్విని ఆమెను ప్రసవానికి తీసుకెళ్లారు. ఆమెతో పాటుగా ఇద్దరు ఏఎన్‌ఎంలు కూడా ఉన్నారు. అయితే ప్రసవ సమయంలో బిడ్డ మరణించింది. ఈ విషయాన్ని దాచేసి ఆ తల్లిని ఇంటికి పంపించేశారని, అంతటితో ఆగక వారి వద్ద నుంచి ప్రభుత్వం నుంచి ఇచ్చే పుస్తకాన్ని, స్కానింగ్ రిపోర్ట్‌లను లాక్కొన్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రాగా, సంబంధిత ఏఎన్‌ఎంను 'సాక్షి' వివరణ కోరగా ఆమె తాను రికార్డులోకి నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అయితే అప్పటికప్పుడు వైట్‌నర్ వేసి అక్కడ సుజాత ప్రసవం వివరాలు రాసి ఆ ఫొటోను సదరు ఏఎన్‌ఎం అందజేశారు. ఆ సమయంలో డ్యూటీలో ఉన్న వైద్యాధికారిణి-2 తేజశ్విని మాత్రం తమకేమీ తెలియదన్నట్లు పీహెచ్‌సీ రికార్డులో వివరాలు నమోదు చేయలేదు. కానీ ఏఎన్‌ఎం ఆ వివరాలు తన రిజిస్టర్‌లో నమోదు చేయడంతో అసలు విషయం బయటకొచ్చింది. ఈ విషయంపై డా.రామకృష్ణను వివరణ కోరగా బిడ్డ మరణించిన విషయమే తనకు తెలియదని చెప్పారు. వైద్యాధికారిగా ఉన్న రామకృష్ణకు తెలిసిఉంటే ఆ మరణాన్ని రికార్డులో నమోదు చేయించేవారు. కానీ ఆ తేదీలో ఎలాంటి స్టిల్ బర్త్‌లు నమోదు కాలేదు. అయితే 9 నెలలకు ప్రసవానికి వచ్చిన గర్భిణి సుజాత కడుపులో పెరుగుతున్న బిడ్డ ఆరోగ్యంగానే ఉన్నట్లు రిపోర్ట్‌లు ఉన్నాయని సంబంధిత ఆశా కార్యకర్త పేర్కొనడం గమనార్హం. మరి మరణం ఎలా సంభవించింది? అనేది ఉన్నతాదికారులు విచారణలో తేలాల్సి ఉంది.

డీడీఓ కోసం పోట్లాట

జిల్లాలో ఎక్కడా లేని విధంగా చిలమత్తూరు పీహెచ్‌సీ వివాదాల్లో టాప్‌లో నిలుస్తోంది. ఎన్ని విచారణలు, హెచ్చరికలు జారీ చేసినా ఇక్కడ పనిచేస్తున్న వారి తీరు మారలేదు. చివరకు ఇద్దరు డాక్టర్లను తాత్కాలిక బదిలీ చేసి సమస్య సద్దుమణిగేందుకు ఉన్నతాధికారులు ప్రయత్నాలు చేశారు. ఇన్ని వివాదాలకు కారణం ఆధిపత్యం కోసమే అన్నది స్పష్టంగా అర్థమవుతోంది. 104 సేవల్లో భాగంగా విధుల్లో ఉండగానే డాక్టర్ తేజశ్విని గోలీలాట ఆడే వీడియో వైరల్ అయింది. ఆ వ్యవహారంలో డా. తేజశ్వినిని వివరణ కోరిన అధికారులు , ఎంఎల్‌హెచ్‌పీ పావని ఆత్మహత్యాయత్నం వ్యవహారంలో కూడా ఏకపక్షంగానే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆస్పత్రి పరిస్థితులు మార్చాలని బదిలీలకు శ్రీకారం చుట్టిన ఉన్నతాధికారులు బాధిత ఎంఎల్‌హెచ్‌పీని ఎందుకు బదిలీ చేశారన్నదానికి సరైన సమాధానాన్ని ఇవ్వలేదు. దీనికితోడు డా. తేజశ్వినిని కొండాపురం, డా.రామకృష్ణను బత్తలపల్లికి తాత్కాలిక బదిలీపై పంపారు. అయితే చిలమత్తూరు పీహెచ్‌సీకి చెందిన ఇద్దరిని పంపిన అధికారులు, కోడూరు పీహెచ్‌సీ డాక్టర్లను చిలమత్తూరు పీహెచ్‌సీకి అటాచ్ చేశారు. డీడీఓ వ్యవహారంలో డా.రామకృష్ణను తప్పిస్తూ బదిలీపై వెళ్లిన తేజశ్వినికి అప్పజెప్పడం ఏంటన్నది మిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది. పీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్యులను కాదని, ఎలా ఆమెకు డీడీఓ అప్పజెప్పారని డీఎంహెచ్ఓ, డిప్యూటీ డీఎంహెచ్ఓలను 'సాక్షి' వివరణ కోరగా ఆ విషయం తమ పరిధిలోనిది కాదని, జిల్లా కలెక్టర్ నిర్ణయం అంటూ వారు సమాధానం దాట వేశారు. శిశువు మరణం తర్వాతనే ఆస్పత్రిలో తరచూ వివాదాలు వెలుగులోకి వస్తున్నాయన్నది బహిరంగ రహస్యమే. అయితే తప్పెవరిదో తెలుసుకొని విచారణ చేయాల్సిన ఉన్నతాధికారులు తప్పు ఒకరు చేస్తే.. శిక్ష మరొకరికి వేసి వివాదాన్ని మరింత రాజేశారంటూ మండల ప్రజానీకం జోరుగా చర్చించుకుంటున్నారు.



స్టిల్ డెత్ నమోదును వైట్‌నర్ వేసి దిద్దినట్లు స్పష్టంగా కనిపిస్తున్న దృశ్యం

ఎస్సీ రైతుల సంక్షేమానికి కృషి

మడకశిరరూరల్: నియోజకవర్గంలోని ఎస్సీ రైతుల ఆర్థిక సంక్షేమానికి కృషి చేయాలని, ఇందుకు తన వంతు పూర్తి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే తిప్పేస్వామి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య, డైరెక్టర్ శంకరప్ప తెలిపారు. బుధవారం కేతేపల్లి గ్రామంలో వారు ఎమ్మెల్యేను కలిసి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించే స్కీమ్‌లను వివరించారు. నియోజకవర్గంలో భూమి లేని అర్హులకు న్యాయం చేయడం లేదని, స్థానిక ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అన్యాయం చేస్తున్నారని ఎమ్మెల్యే వారిపై మండిపడ్డారు. జాబితాను పరిశీలించి అర్హత లేని వారిని తొలగించి అర్హత ఉన్న ఎస్సీ రైతులకు న్యాయం చేయాలన్నారు.

23 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వడం హర్షణీయం



సమన్వయకర్త దీపిక, వేణురెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగులు

హిందూపురం: డీఆర్‌డీఏ ఉద్యోగులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 23 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించడం హర్షణీయమని వైకేపీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఆఫీసు వద్ద తరలివచ్చి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్ దీపికను సన్మానించారు.

బాబు, పవన్‌ను ప్రజలు నమ్మరు



కేతేపల్లిలో గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



లేపాక్షి: సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త దీపిక

- ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

మడకశిరరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనలో పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా తీసుకొని సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందిస్తున్నారని మళ్లీ మా మద్దతు జగనన్న సంక్షేమ పాలనకే అని లబ్ధిదారులు, మహిళలు తెలిపారు. మండల పరిధిలోని సీ కొడిగేపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని కేతేపల్లి, నల్లనయునపల్లి గ్రామాల్లో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రతి ఇంటికి లబ్ధి పొందిన బుక్‌లెట్‌ను కుటుంబ సభ్యులకు అందించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీఎం జగనన్న పరిపాలనలో తమకు ఎంతో మేలు జరిగిందని, మళ్లీ సీఎంగా వైఎస్ జగన్ ఉంటేనే పేదలకు కొండంత భరోసా ఉంటుందని మహిళలు లబ్ధిదారులు ఎమ్మెల్యేకు వివరించారు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోలేదని, మళ్లీ ఎన్ని హామీలు ఇచ్చినా చంద్రబాబును నమ్మమని మహిళలు తెలిపారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ను ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలను ప్రజలు నమ్మరన్నారు. కేతేపల్లి గ్రామ ప్రజల విజ్ఞప్తిని మేరకు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి మినరల్ వాటర్ అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉంటేనే సక్రమంగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. వైఎస్ జగన్ పరిపాలనలో వలంటీర్ల, సచివాలయ వ్యవస్థ ద్వారా పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సభ్యురాలు సరోజమ్మ, వైస్ ఎంపీపీలు శ్రీరామరెడ్డి, మూర్తి, సింగల్ విండో అధ్యక్షులు రామిరెడ్డి, ఎంపీటీసీ శారదమ్మ, మండల ఎస్సీ సెల్ నాయకుడు జమ్మానిపల్లి మూర్తి, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ్, మాజీ ఎంపీపీ బజ్జప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త దీపిక

లేపాక్షి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేవిధంగా ఆయన కృషి చేస్తున్నారు. అని హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్.దీపిక అన్నారు. బుధవారం ఉదయం మండలంలోని కల్లూరు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందించిన లబ్ధిని వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం పూర్తి చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌నేనన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ముఖ్యమంత్రి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. గతంలో చంద్రబాబు డ్వాక్రా మహిళలకు రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి ముఖ్యమంత్రి అయ్యాక రుణాలు మాఫీ చేయకుండా మోసం చేసారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలిపించి మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్ర పురోభివృద్ధికి సీఎం జగన్ ఎంతగానో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వరలక్ష్మి పండుగను పురస్కరించుకుని ప్రతి కుటుంబంలోని మహిళకు ఆమె చీర, జాకెట్, పసుపు, కుంకుమ, గాజులతో కూడి బ్యాగ్‌ను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వసుంధర, వైస్ ఎంపీపీ నీలావతి, మండల కన్వీనర్ నారాయణస్వామి, తహసీల్దార్ బాబు, ఎంపీడీఓ నరసింహనాయుడు, వ్యవసాయాధికారి శ్రీలత, హౌసింగ్ ఏఈ వాసంతి, స్థానిక నాయకులు హనుమంతప్ప, క్రిష్టప్ప, ప్రభాకర్, చెన్నకేశవ, రాము, రవీంద్రరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, తిప్పన్న, అశ్వర్థప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డి పర్యటన విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ నాయకులు వేణురెడ్డి

హిందూపురం: వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ ఆఫీసు ప్రారంభోత్సవానికి ఈనెల 25న విచ్చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాయలసీమ రీజినల్ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటనను పార్టీ నాయకులందరూ కలిసికట్టుగా విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం స్థానిక పార్టీ ఆఫీసు వద్ద హిందూపురం, పట్టణ, మండల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందూపురం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అందరూ సహకరించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్‌చైర్మన్లు జబీవుల్లా, బలరామిరెడ్డి, కౌన్సిలర్లు, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, నక్కలపల్లి శ్రీరాంరెడ్డి, ఆనంద్‌రెడ్డి, సీపీసీ సాధిక్, ఆర్‌కె ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్రకేసరి జయంతి



ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

హిందూపురం: దేశ స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ తుపాకీకి గుండె చూపిన ధీరశాలి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ధైర్యసాహసాలు దేశపౌరులకు స్ఫూర్తి దాయకమని పలువురు కొనియారు. టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని స్థానిక డీఆర్‌కాలనీలో బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కల్లూరు ఆదినారాయణ, ఉదయ్‌కుమార్, మురళీదేశాయ్, చైతన్యగంగిరెడ్డి, నాగార్జున, రామ్మూర్తి, నాగేశ్వరరావు, నాగరాజు, శ్రీనివాసులు, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలపై అవగాహన



శిబిరాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి హరిణి

పావగడ: మూఢ నమ్మకాలు, కట్టుబాట్లపై ప్రజల్లో అవగాహన కల్పించి వాటిని పూర్తిగా నివారించేలా స్థానిక గ్రామ ప్రముఖులు కృషి చేయాలని తాలూకా న్యాయ సేవా సమితి అధ్యక్షురాలు, జేఎంఎఫ్‌సీ సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఎం ఎస్ హరిణి సూచించారు. తాలూకా లోని సీకేపురం గ్రామ పంచాయతీ పరిధిలోని దేవరహట్టి గ్రామంలో బుధవారం నిర్వహించిన మూఢ నమ్మకాలపై అవగాహన శిబిరంలో ఆమె పాల్గొని పలు సూచనలు, సలహాలిచ్చారు. సివిల్ న్యాయమూర్తి విస్మిత మూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హెచ్ శేషానందన్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కలు నాటించండి

రొళ్ల: ఉపాధి పథకం ద్వారా డ్రైలాండ్ హార్టికల్చర్ కింద పండ్ల మొక్కలు పెంపకానికి మంజూరైన రైతుల పొలాల్లో విరివిగా మొక్కలు నాటించాలని ఎంపీడీఓ కల్లుమడి ఆజాద్ పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జాబ్‌కార్డులు కలిగిన ప్రతి కూలీకి వంద రోజుల పని దినాలు కల్పించి వలసలు నివారించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ ఓబుళప్ప, సీఓలు, టీఏలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేలకు ఉలవలు

అమరాపురం: మండలంలోని హేమావతి, మద్దనకుంట, హాలుకూరు గ్రామ సచివాలయాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాలకు బుధవారం ఉలవలు వచ్చాయి. పేరు నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో ఉలవలు పంపిణీ చేస్తోందని ఏఓ మంజునాథ తెలిపారు. ప్రస్తుతం 50 క్వింటాళ్ల ఉలవలు వచ్చాయన్నారు.

అంబరాన్నంటిన సంబరం



హిందూపురం: గాంధీసర్కిల్ వద్ద సంబరాల్లో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు



పరిగి: ఏపీఆర్‌ఎస్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



రొళ్ల: జాతీయ జెండాతో సంబరాలు చేసుకుంటున్న యువకులు

సాక్షిబృందం: చంద్రయాన్-3 విజయవంతం కావడంతో హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో సంబరాలు మిన్నంటాయి. జాతీయ పతాకాలు పట్టుకొని యువకులు, ఉపాధ్యాయులు, వివిధ పార్టీల నాయకులు జయహో భారత్ అంటూ ర్యాలీలు చేశారు. చంద్రయాన్-3 విజయవంతం భారత దేశానికే గర్వకారణమని కొనియాడారు.

భావి తరాలకు స్ఫూర్తిదాయకం



చంద్రయాన్-3 విజయవంతం భావి తరాలకు స్ఫూర్తిదాయకం. ప్రతి భారతీయుడూ గర్వపడేరోజిది. చంద్రయాన్ 1, 2 నేర్పిన గుణపాఠాలను అవకాశాలుగా మలచుకుని ఇంతటి ఘన విజయం సాధించిన ఇస్రో శాస్త్రవేత్తలకు కృతజ్ఞతలు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశ కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచానికి చాటాలి.

– జి సౌజన్యలక్ష్మీ, తహసీల్దారు, పరిగి

గగన చరిత్రలో గొప్ప అధ్యాయం



భారతీయ అంతరిక్ష పరిశోధన శాస్త్రవేత్తలు చరిత్ర సృష్టించిన రోజు ఇది. చంద్రయాన్ - 3 చంద్రుడి దక్షిణ ధృవం వద్ద దిగడం చాలా సంతోషంగా ఉంది. ఈ విజయంతో ప్రపంచంలోని దేశాలు మన దేశం వైపు చూస్తున్నాయి.

–సుమన్ననాయక్, భౌతికశాస్త్ర అధ్యాపకుడు, అమరాపురం

శాస్త్రవేత్తలకు అభినందనలు



చంద్రయాన్ -3 విజయవంతం చేసిన ఇస్రో శాస్త్ర వేత్తలకు అభినందనలు తెలిపారు. అంతరిక్ష చరిత్రలో భారత్ సరికొత్త అధ్యాయనం లిఖించింది. మన దేశంలో భవిష్యత్‌లో మరిన్ని ప్రయోగాలకు ఈ విజయం ఎంతగానో ఉపయోగ పడుతుంది.

– భాస్కర్, ఎంఈఓ, మడకశిర

సరికొత్త చరిత్ర సృష్టించారు



చంద్రయాన్-3 విజయవంతానికి కృషి చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు, శుభాకాంక్షలు. ఈ విజయంతో యావత్ దేశం మురిసిపోతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారతీయులంతా ఆయా దేశాల్లోనూ త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించారు.. భారత్ సరికొత్త చరిత్ర సృష్టించింది.

– గాజుల రాము, విద్యార్థి, రొద్దం

వృద్ధుడికి తీవ్రగాయాలు

చిలమత్తూరు: మండలంలోని 544ఈ జాతీయ రహదారి చిలమత్తూరు - హిందూపురం ప్రధాన రహదారి కనుమ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద బుధవారం ద్విచక్ర వాహనాన్ని మరొక ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ఘటనలో బాగేపల్లి తాలూక పుల్లగూర్లపల్లి గ్రామానికి చెందిన గంగిరెడ్డి అనే వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఆధార్‌లో మార్పులు చేసుకోండి

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆధార్ కార్డులో మార్పులు చేర్పులు, కొత్త కార్డుల కోసం ఆయా గ్రామ సచివాలయాల్లో నిర్ణయించిన తేదీల్లో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. బుధవారం అమరాపురం గ్రామ సచివాలయం- 1 లో ఆధార్ సేవలందించారు.